క్లుప్తంగా

పంచాయతీలకు వీధిలైట్లు అందజేత



సర్పంచ్‌లకు వీధిలైట్లు అందిస్తున్న యూనిట్‌హెడ్ సజేంద్రకుమార్

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు వీధిలైట్లు అందజేశారు. గురువారం కంపెనీ సీఎస్ఆర్ కార్యాలయంలో యూనిట్ హెడ్ సజేంద్రకుమార్ తుమ్మలపెంట, బందార్లపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల సర్పంచ్‌లకు ఎల్ఈడీ వీధి లైట్లను అందించారు. సీఎస్ఆర్ నిధులతో ఒక్కో పంచాయతీకి 50కి పైగానే లైట్లు పంపిణీ చేశారు. కంపెనీ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు లైట్లు అందించామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పంక్షన్‌హెడ్ రంగకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ప్యాపిలి: మండల పరిధిలోని గుట్టలపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గురువారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడు విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. ఫలితంగా తమ పిల్లల చదువుకు ఆటంకం కలుగుతోందని వాపోయారు. తక్షణమే వెంకటరమణ అనే ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుని అతని స్థానంలో మరొకరిని నియమించాలని కోరారు. ఈ విషయమై ఎంఈఓ వెంకటేశ్ నాయక్‌ను వివరణ కోరగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో 11కేవీ విద్యుత్ లైన్ల మార్పు కారణంగా శుక్రవారం రైల్వే గేట్ల నుంచి సీపీఐ కార్యాలయం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

కార్మికుల కృషితోనే సంస్థ పురోగతి



కార్మికునికి పురస్కారాన్ని అందిస్తున్న డిపో మేనేజర్

డోన్ టౌన్: ఆర్టీసీ మనుగడ, పురోగతి సాధించాలంటే కార్మికుల కృషి ఎంతో ముఖ్యం అని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను గురువారం స్థానిక డిపోలో ఘనంగా సత్కరించారు. డ్రైవర్లలో అత్యధికంగా మైలేజీ సాధించిన ఎంఎస్ హుస్సేన్, వైఎంఎస్ రెడ్డి, డీఎస్ రెడ్డి, కండక్టర్లలో అత్యధిక కలెక్షన్లు తీసుకొచ్చిన ఐవీఆర్ రెడ్డి, ఓబులపతి, వైవీఎల్ దేవి, గ్యారేజ్‌లో మెకానిక్ రాముడు, వెల్డర్ శ్రీనివాసులును సత్కరించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ జాన్ మోజేష్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు పుల్లయ్య, గోపాల్, యూనియన్ నాయకుడు సుదర్శన్ రావు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహానికి మండల పూజ



పూజల్లో పాల్గొన్న వాల్మీకులు

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహల వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహానికి గురువారం మండల పూజను ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని మండల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, హోమాలు, ఇతర పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.15,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అన్నదాతపై ‘ప్రీమియం’ భారం

- ఉచిత పంటల బీమా అమలు చేయని కూటమి ప్రభుత్వం
- రైతులే ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి
- ఈ నెల 15 వరకు గడువు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుల వాటా ప్రభుత్వమే చెల్లింపు
- ప్రభుత్వ తీరుపై రైతుల అసహనం



సంజామల: ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పెట్టుబడి సాయం చేయకుండా చేతులెత్తేసింది. అంతేకాకుండా రైతుపై అదనంగా బీమా ప్రీమియం భారం మోపింది. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని చెప్పడంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేసి, పరిహారం కూడా అందించిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 బ్యాంకు అకౌంట్‌లో జమచేసింది. అంతేకాకుండా బీమా ప్రీమియం రైతు వాటా ప్రభుత్వమే చెల్లించి తోడుగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే అదే సీజన్‌లోనే రైతుకు పంట నష్టం కింద పరిహారాన్ని అందించి ఆదుకుంది. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులను నియమించి రైతులకు బాసటగా నిలిచింది.

పంట	బీమా ప్రీమియం(హెక్టార్‌కు)
వరి	రూ.420
పెసలు	రూ.90
మినుములు	రూ.95
వేరుశనగ	రూ.150
శనగ	రూ.140

ఇప్పుడు రైతు పరిస్థితి ఇలా..

ఎన్నికల సమయంలో రైతులకు ఏటా అన్నదాత సుఖీభ పథకం కింద రూ.20 వేలు అందస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్ పూర్తి అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం చేయలేదు. దీనికి తోడు రైతులకు ఉచిత బీమా పథకానికి కూడా మంగళం పాడారు. బీమా పరిహారం కావాలంటే ప్రీమియం రైతే చెల్లించుకోవాలని చెప్పడంతో వ్యవసాయం భారంగా మారింది. రైతులు పండించిన పంటకు చీడపీడ, తెగుళ్లు అధికం అయ్యాయి. పంట అమ్ముకోవాలంటే గిట్టుబాటు ధర లేక రైతు దిగులు చెందుతున్నారు.

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించి ఏ పథకం సక్రమంగా అమలు కాలేదు. పెట్టుబడి సాయం అందక సాగు కష్టంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయాం. బీమా ప్రీమియం చెల్లింపు భారంగా మారింది. బీమా ప్రీమియం రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించాలి. అదేవిధంగా రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు కల్పించాలి.

–కుపేంద్రా రెడ్డి, రైతు, సంజామల

రైతులపై భారం తగదు



కూటమి ప్రభుత్వం రైతుకు ఇచ్చిన హామీలు అమలు చేసి అండగా ఉంటుందనుకున్నాం. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ కూటమి నేతలు ఇచ్చిన హామీని విస్మరించారు. పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. రైతుల సమస్యలను పట్టించుకోని కూటమి సర్కార్ బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలనడం చాలా బాధాకరం.

–మధు సుధాకర్, రైతు ఆకుమల్ల

రైతులే ప్రీమియం చెల్లించాలి

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకుని రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించకుంటే నష్టపరిహారం రాదు. బీమా వర్తింపునకు రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు పంట నమోదు, బీమా ప్రీమియం చెల్లించాలి.

–సుధాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి, సంజామల

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

బేతంచెర్ల: విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారని 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రణాళికతో చదవాలని సూచించారు.విద్యార్థుల అల్పాహారాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్రిన్సిపాల్ అబిదా బేగంకు సూచించారు.

రేపు దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు

బేతంచెర్ల: కర్నూలు రహదారిలోని షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం మార్గశుద్ధ పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కృపాధామ కమిటీ సభ్యులు తెలిపారు. సాయిబాబాకు, దత్తాత్రేయ స్వామి, మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



బనగానపల్లెలో శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ



బేతంచెర్ల: గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పేదరికం లేని, ఆరోగ్యకరమైన గ్రామం, మంచి పాలన, పచ్చదనం, పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు వంటి తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న వనరులను బట్టి ఆదాయ మార్గాలు పెంచుకుని అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య లోపం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ జ్యోతి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలి

బనగానపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధికి తొమ్మిది రకాల అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. వాటిని అమలు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడానికి శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. టీఓటీలు సుబ్బరాయుడు, మహేష్, శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పలుకూరు ఈఓ బాలాంజనేయులు, ఏపీఎం రేష్మా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, అధికారులు

ప్రతి ఒక్కరూ సహకరించాలి

బేతంచెర్ల: పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంబాపురం, సిమెంట్‌నగర్, ఎంబాయి, గోర్లగుట్ట, గోరుమానుకొండ, గూటుపల్లె, హెచ్ కొట్టాల, కొలుములపల్లె, ఎం.పేండేకల్లు గ్రామాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంను నిజం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, వైస్ ఎంపీపీ రంగస్వామి, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

విధులకు డుమ్మా



7వ సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలైనా కానరాని ఉద్యోగులు

డోన్: మున్సిపల్ పరిధిలో 16 సచివాలయాలు ఉండగా, అందులో పనిచేస్తున్న చాలా మంది ఉద్యోగులు అధికార పార్టీ నాయకుల అండదండలతో నామమాత్రంగా విధులకు హాజరవుతున్నారు. గురువారం స్థానిక 7వ సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలు కావస్తున్నా ఏ ఒక్కరూ కనిపించలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. చాలా కాలం నుంచి ఈ విధంగా విధులకు డుమ్మా కొడుతున్నా మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షణ ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి రిమాండ్

అవుకు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రామాపురం గ్రామానికి చెందిన ప్రకాశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదీ అవుకు బస్టాండ్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా రామాపురం గ్రామానికి చెందిన ప్రకాశ్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడని అనుమానంతో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశామన్నారు. మద్యం తాగినట్లు రుజువైందన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని బనగానపల్లె మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా 30 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వెల్లడించారు.



ఎర్రగా మారుతున్న శనగ పంట

దెబ్బతిన్న శనగ పంట

కొలిమిగుండ్ల: రబీలో ఎన్నో ఆశలతో సాగు చేసిన శనగ పంట ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో ఇటీవలే మోస్తరు వర్షాలు కురిశాయి. తిమ్మనాయినపేటలో మోస్తరు మించి వర్షం కురవడంతో శనగ పంట దెబ్బతింది. గ్రామానికి చెందిన రైతులు పెద్దమద్దిలేటి, వెంగయ్య, భూషణంతో పాటు పలువురు రైతులకు చెందిన పదిహేను ఎకరాల్లో సాగు చేసిన శనగ పంట కుళ్లిపోయి ఎర్రగా మారుతోందని వాపోయారు. వర్షం కురిశాక ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎకరాకు ఏడెనిమిది వేల మేర ఖర్చు పెట్టి పంట సాగు చేశారు. పంట బాగా ఉందనుకున్న సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడి పూర్తిగా తగ్గిపోయి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పార్కులో సమస్యలపై బుగ్గనకు వాకర్ల వినతి



పార్కును శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచనలు చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక పార్కులను ఏర్పాటు చేస్తే, అధికారుల వైఖరి వల్ల ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారుతున్నాయని స్థానికులు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు మాజీ మంత్రి బుగ్గన కోట్రికె వెంకటశేష ఫణిశెట్టి పార్కులో వాకర్లతో కలిసి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా యోగా సెంటర్‌తో పాటు చిన్నపిల్లల ఆట వస్తువుల గురించి వాకర్ల నుంచి వాకబు చేశారు. పలువురు వాకర్లు మాట్లాడుతూ.. నాలుగు, ఐదు నెలల నుంచి పార్కులో పిచ్చి మొక్కలను తొలగించడం లేదని, విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని వాపోయారు. వాకింగ్ ట్రాక్ పాడైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. స్పందించిన బుగ్గన వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, గీతా యోగాసన సంఘం గౌరవాధ్యక్షుడు రాంపుల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు కుమ్మరి రాజు, పార్టీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, రాజు, సతీష్, షభరీస్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నాగిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన

డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన నాగిరెడ్డి, పాతపేటకు చెందిన సందు నాగసుబ్బారెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన గురువారం ఆయా కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. మైనార్టీ నాయకులు అక్బర్ బాషా, కౌన్సిలర్లు కురుకుంద హరి, ఫారెస్ట్ మౌలాలి, బుర్రు శ్రీధర్, వేణు, బోయ వేణు, సుమలత సురేష్ ఉన్నారు.

రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం



విజయోత్సవ ర్యాలీలో నాయకులు

డోన్ రూరల్: ఇటీవల జరిగిన రైల్వే ఎన్నికల్లో జోనల్ స్థాయిలో మజ్దూర్ యూనియన్ సత్తా చాటిందని జోన్ మజ్దూర్ యూనియన్ సెక్రటరీ అహ్మద్ బాషా హర్షం వ్యక్తం చేశారు. గురువారం యూనియన్ ఎన్నికలతో కలిసి పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. రైల్వే కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్మికులకు మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మహిళా సమాఖ్య నాయకురాలు

డోన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీమ్ బేగం, సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలన్నారు.

రైతులను మభ్యపెట్టేందుకే సదస్సులు

డోన్ టౌన్: రైతులను మభ్యపెట్టేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని.. వాటి వల్ల పెద్దగా ప్రయోజనం లేదని విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ఆరోపించారు. స్థానిక ముక్తేశ్వర ఆలయంలో గురువారం ఆయన మాట్లాడారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు గతంలో జరిగిన గ్రామ సభల్లో ఇచ్చిన ఫిర్యాదులకు ఇంత వరకు పరిష్కారం చూపని ప్రభుత్వం ఇప్పుడు చేస్తుందనే నమ్మకం లేదని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారం కాక చాలా మంది రుణాలు పొందలేకపోతున్నారని చెప్పారు. రైతులు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సదస్సు

డోన్ రూరల్: మండల పరిధిలోని జగదుర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సుకు జనం నుంచి స్పందన కరువైంది. ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. తహసీల్దార్ కె.నాగమణి, అధికారులు ఎదురుచూసినా జనం రాలేదు. అర్భాటం తప్ప సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం లేకనే జనం రావట్లేదనే చర్చ జరుగుతోంది.

బనగానపల్లె రూరల్: రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెర్లోకొత్తూరు, క్రిష్టగిరి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో తెలియజేస్తే 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపుతామన్నారు. చెర్లోకోత్తూరులో 20, క్రిష్టగిరిలో 15 అర్జీలు వచ్చాయని తెలిపారు.



బనగానపల్లె: క్రిష్టగిరిలో అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు,

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లెలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో 23 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ప్రకాశ్ బాబు తెలిపారు. ఇందులో సర్వే కోసం 7, సవరణల కోసం 16, చుక్కల భూములకు సంబంధించి ఒక్క దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.



కలుగొట్లలో మిరప పంటను తొలగిస్తున్న కూలీలు

రైతు కష్టం నేలపాలు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. మొదట్లో వర్షాభావం, ఆ తర్వాత అధిక వర్షం, తెగుళ్లు చుట్టుముట్టాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే పరిస్థితి లేకపోవడంతో మిరప పంటను దున్నేస్తున్నారు. కోవెలకుంట్ల మండలం కలుగొట్లకు చెందిన రాముడు అనే రైతు 3 ఎకరాల పొలంలో మిరప పంట సాగు చేశాడు. మిరప నార, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు నివారణ తదితర పెట్టుబడులతో ఎకరాకు రూ.లక్షకు పైగా మూడు ఎకరాలకు రూ.4 లక్షలు వెచ్చించాడు. వైరస్ కారణంగా పైరులో ఎదుగుదల నిలిచిపోయి పూత, పిందె నిలిచిపోయింది. చేసేది లేక గురువారం రైతు పంటను తొలగించాడు. వైరస్ దెబ్బతో పంట దెబ్బతిని లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లడంతో లబోదిబోమంటున్నాడు. అధికారులు దెబ్బతిన్న పంటను పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.



తొలగించిన పంటను గట్టున పడేస్తున్న దృశ్యం